కేరళ మాజీ సీఎంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట: కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చేసిన సేవలు మరువలేనివని సీపీఎం కన్వీనర్ ఆర్ మల్లేశ్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో అడ్డగుట్టలో ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జోన్ కమిటీ సభ్యులు అజయ్‌బాబు, గోపాల్, లలిత, సామ్యుల్, శ్యామల, కోటేశ్వరరావు, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న అలివేలి రాజు

రసూల్‌పురా: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8300 కోట్ల స్కాలర్‌షిప్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థుల రూ. 9 కోట్ల మెస్ చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, హైదరాబాద్ మహానగర కన్వీనర్ పాండురంగ్, బేగంపేట జాయింట్ సెక్రటరీ పవన్ చౌహాన్, జాయింట్ సెక్రటరీ కృష్ణ, విద్యార్థి నాయకులు దుర్గేశ్, భాను రామ్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్టు



డ్రైవర్‌ను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పీఎస్ పరిధిలోని హబ్సిగూడ ప్రధాన రహదారిపై నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఉప్పల్, అంబర్‌పేటకు చెందిన ఏడుగురు మందు బాబులపై కేసు నమోదు చేసినట్లు నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సుధాకర్‌రావు తెలిపారు. తనిఖీల్లో నల్లకుంట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



ఓయూ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శివకుమార్

లాలాపేట: ఓయూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నేతలపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి నేతలతో కలిసి ఓయూ పీఎస్ ఇన్‌స్పెక్టర్ అప్పల నాయుడికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. దాడి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకుడు మేడే శ్రీను తదితరులు ఉన్నారు.

తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శోభాన్‌బాబు

లాలాపేట: తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు చుండి శోభాన్‌బాబు మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు రైతులంతా సిద్ధం కావాలని ఉత్సాహవంతులైన వారికి పార్టీ మద్దతుగా నిలుస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన అనేక ప్రభుత్వాలు, పార్టీలు రైతులను పట్టించుకోలేదని, రైతులంతా తమ పార్టీకి అండగా నిలవాలని ఆయన కోరారు.

వీధి దీపాలు 20 వేలు.. వెలగనివి 15 వేలు..!

ఖైరతాబాద్ సర్కిల్‌లో కమ్ముకున్న చీకట్లు



- అంధకారంలో పలు బస్తీలు..కాలనీలు
- నాలుగింట మూడొంతులు చీకటి రహదారులే
- ఇబ్బందుల్లో స్థానిక ప్రజలు, పట్టని అధికారులు

సనత్‌నగర్: ఎస్సార్టీకాలనీ వినాయక గ్రౌండ్‌లో లైట్లు వెలగడం లేదని జీహెచ్ఎంసీ వీధిదీపాల అధికారులకు ఫిర్యాదు చేసి 15 రోజులైంది.. అయినా పట్టించుకున్న పాపానపోలేదు. మరోవైపు సనత్‌నగర్ ప్రధాన రహదారిలో కొన్ని లైట్లు వెలగడం లేదని మొత్తుకున్నా కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు..పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తోన్నా సంబంధిత అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో మూడొంతుల వీధులు అంధకారంలోనే ఉన్నాయని అధికారులే సెలవిస్తుంటే ఇక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఖైరతాబాద్ సర్కిల్‌లో గతంలో పని చేసిన వీధిదీపాల అధికారి సెలవుపై వెళ్లడంతో మరొకరు ఇటీవలే చార్జి తీసుకున్నారు. అయితే ఇక్కడి సమస్యలు చిట్టా చూసేసరికి అ అధికారే విస్తుపోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో పని చేసిన అధికారి వీధిదీపాల మెటీరియల్‌ను కూడా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల గదిలో నిల్వ ఉంచినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న కొత్తగా వచ్చిన అధికారి అవాక్కయ్యారు. చార్జి తీసుకున్న వెంటనే ఆ మెటీరియల్‌ను ప్రభుత్వ అధికారిక బిల్డింగ్‌లోకి మార్చే పనిలో పడినట్లు సమాచారం.





సనత్‌నగర్‌లోని పలు రహదారుల్లో వెలగని వీధి దీపాలు

బస్తీల్లో అంధకారం..

ఖైరతాబాద్ సర్కిల్‌లోని చాలా బస్తీలు అంధకారంలో మగ్గుతున్నాయి.ప్రధాన, అంతర్గత రహదారులు అని తేడా లేకుండా లైట్లు వెలగక అటు వాహనదారులు, ఇటు పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్‌లో దాదాపు 20 వేల వరకు వీధిదీపాలు ఉండగా 15 వేల వరకు వెలగడం లేదని తెలుస్తోంది. సర్కిల్ పరిధిలో సనత్‌నగర్, అమీర్‌పేట, ఖైరతాబాద్, సోమాజీగూడ డివిజన్లు ఉండగా చాలావరకు చీకట్లోనే మగ్గుతున్నాయని ఆయా ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఓ వైపు అధ్వాన రహదారులు.. మరోవైపు వరదల భయంతో ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని చీకట్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉంటే సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులు కూడా తరచుగా నమోదవుతున్నాయి. ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను టార్గెట్ చేసుకునే క్రమంలో సీసీ కెమెరాలకు దొరకకుండా చీకటి రహదారులనే ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టి లైట్లు వెలిగేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బోనాల సందడి



వేడుకల్లో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

అమీర్‌పేట: ఆషాఢ మాసం బోనాల సమర్పణకు చివరి మంగళవారం కావడంతో బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. గర్భగుడిలోని అమ్మవారిని వివిధ మిఠాయిలు, డ్రై ఫ్రూట్స్‌తో అలంకరించారు.

బోనం సమర్పించిన గ్రంథాలయ చైర్మన్

బల్కంపేట అమ్మవారికి హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి బోనం సమర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్, కమల్‌రాజ్, రమేశ్, వెంకట్‌రెడ్డి, బాబు తదితరులు ఉన్నారు.




సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో..

గాంధీఆస్పత్రి : జీడీఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. భాజాభజంత్రీలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎస్ రాజకుమారి, సూర్యాపేట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శరవన్‌కుమార్, అనస్థీషియా హెచ్ఓడీ ప్రొఫెసర్ మురళీధర్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, చీఫ్ డైటీషియన్ రమేశ్, జీడీఎక్స్ ప్రతినిధులు రవికుమార్, శివాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్ పాల్గొన్ని అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

బేగంపేట మాతాజీనగర్‌లో..

సనత్‌నగర్: బేగంపేట మాతాజీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో మంగళవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సూదం, లక్ష్మయ్య, డివిజన్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు రాధ, శివచౌదరి, అరుణ్, మొహిత్, బాల, చిరంజీవి, కృష్ణ, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన బీజేపీ నాయకులు

అరుట్ల మైసమ్మ ఆలయంలో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ఉప్పరిబస్తీలోని అరుట్ల మైసమ్మ ఆలయంలో మంగళవారం బోనాల జాతర వేడుకలు నిర్వహించారు. మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయిప్రసాద్, నాయకులు అజయ్‌కుమార్, లక్ష్మణ్, సత్యనారాయణ, మధు పాల్గొన్నారు.



వేడుకల్లో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి, అధికారులు

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 70, క్యాప్సికం 65, పచ్చకాకర 23, పందిరి బీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 16, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నేడు శివాలయంలో పూజలు

సనత్‌నగర్: ఆషాఢ మాసం బహుళ చతుర్దశి (మాస శివరాత్రి) ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయం ప్రాంగణంలోని శివాలయంలో బుధవారం ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు (ప్రదోషకాలం) అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

సనత్‌నగర్: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. వివరాల్లోకి వెళ్తే..మియాపూర్ హెచ్ఎంటీకాలనీకి చెందిన భాస్కర్‌గౌడ్ తన తల్లి అలివేలుతో కలిసి బోనాల పండుగను జరుపుకునేందుకు ఈ నెల 20న జింకలవాడలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లారు. భాస్కర్‌గౌడ్ అదే రోజు తిరిగి మియాపూర్ వెళ్లిపోయాడు. అయితే మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో తన తల్లి అలివేలు కనిపించడం లేదంటూ బంధువుల ఇంటి నుంచి ఫోన్ రావడంతో అక్కడికి వెళ్లాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా తల్లి ఆచూకీ కనిపించలేదు. అలివేలుకు ప్రతి రోజూ కల్లు తాగే అలవాటు ఉండగా గత 10 రోజుల నుంచి తాగడం లేదు. కొడుకు భాస్కర్‌గౌడ్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఒక్కసారిగా కల్లు మానేయడంతో ఆమె మానసిక స్థితిలో మార్పు ఏమైనా వచ్చి ఇంటి నుంచి వెళ్లిపోయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మోతీనగర్‌కు చెందిన కంజర్ల ప్రమీల (49) హౌస్ కీపింగ్ పనులు చేస్తుంటుంది. ఈ నెల 20న ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెట్టుబడి పేరిట బురిడి

- రెచ్చిపోయిన ఆన్‌లైన్ కేటుగాళ్లు
- రూ.3.80 లక్షలు కాజేసిన వైనం
- ఒకే రోజు 5 కేసుల నమోదు

సనత్‌నగర్: 'తక్కువ పెట్టుబడి పెట్టండి.. ఎక్కువ మొత్తంలో లాభాలు పొందండి' అంటూ ఆకర్షణీయమైన ఆఫర్లతో బురిడీ కొట్టించి మంగళవారం ఒకే రోజు రూ.3.80 లక్షలు కాజేశారు ఆన్‌లైన్ కేటుగాళ్లు. దీంతో బాధితులు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో ఒకే వ్యక్తి మూడు సార్లు మోసపోయి రూ.2.10 లక్షలు కోల్పోవడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే..

ఒక ఘటనలో రూ.50 వేలు

సనత్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ (42) తన మొబైల్ వాట్సప్‌కు కొంత పెట్టుబడి పెడితే ఆకర్షణీయమైన లాభం ఉంటుందని సందేశం వచ్చింది. దీనికి ఆకర్షితుడైన శ్రీనివాస్ వారు చెప్పినట్లు చేశాడు. వివిధ పేర్లతో యూపీఐ ఐడీ ద్వారా చెల్లింపులు చేయాలంటూ పేటీఎం సందేశం రాగా రూ.50 వేలు పంపించాడు. తర్వాత నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 ఘటనల్లో ఒకే వ్యక్తి నుంచి రూ.2.10 లక్షలు..

సనత్‌నగర్‌కు చెందిన అఖిల్ (27)కు వాట్సప్ ద్వారా ఆఫర్ వచ్చింది. దీనిని నమ్మిన అఖిల్ రూ. లక్ష యూపీఐ ద్వారా పంపించాడు. తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా మరోసారి అదే వ్యక్తి రూ.40 వేలు, ఇంకోసారి రూ.70 వేలు యూపీఐ ద్వారా పంపించి మోసపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేర్వేరుగా 3 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో రూ.1.20 లక్షలు..

సనత్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ (32)కు పెట్టుబడి ఆఫర్ రావడంతో రూ.1.20 లక్షలు యూపీఐ పేమెంట్ చేసి మోసపోయి సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ అధ్యక్షుడి వ్యాఖ్యలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ వ్యాఖ్యలు తగవని బీసీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్‌చార్జి గోదా రవీందర్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల పెంపు, 9వ షెడ్యూల్‌లో చేర్చడం సాధ్యం కాదని చెప్పడం విడ్డురామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పై రాష్ట్రంలో ఒక తీరు ఢిల్లీలో మరొక తీరు మాట్లాడడం సరికాదన్నారు. అసలు బీసీలకు రిజర్వేషన్ల పెంపు పై బీజేపీ వైఖరీ స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే దేశంలో బీజేపీకి పుట్టగతులుండవని హెచ్చరించారు.

'ఏఐ సాధనాలు-సాంకేతికతలు'పై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో సుధాకర్‌రెడ్డి ఉడుముల

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో 'మీడియా విద్యార్థుల కోసం 'ఏఐ సాధనాలు-సాంకేతికతలు' అనే అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ది టైమ్స్ అండ్ ఇండియా హైదరాబాద్‌కు చెందిన విశ్లేషణాత్మక జర్నలిస్టు, ఎడిటర్ సుధాకర్‌రెడ్డి ఉడుముల హాజరై న్యూస్‌రూమ్‌ల్లో ఏఐ సాధనాల వాస్తవిక వినియోగాన్ని వివరించారు. పరిశోధన, డేటా విశ్లేషణ, నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెకింగ్), ఆటోమేషన్, ఆర్కైవింగ్, ట్రెండ్ విశ్లేషణ వంటి రంగాల్లో ఏఐ ఎలా సహాయపడుతుందో తెలియజేశారు. ఏఐ బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్ల వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ భవిష్యత్తుపై ఏఐ ప్రభావాన్ని వివరించారు. భవిష్యత్ ఉద్యోగాల్లో అధిక శాతం ఏఐ నైపుణ్యాలు అవసరముంటాయని పేర్కొన్నారు. ఏదైనా ఏఐ ఉత్పత్తిని బలంగా విశ్లేషించకుండా నమ్మడం ప్రమాదకరమని హెచ్చరించారు. డీప్‌ఫేక్‌లపై అప్రమత్తంగా ఉండాలని, హైవ్ మోడరేషన్, సింథిడ్ లాంటి సాధనాలతో ఫొటోలు, వీడియోలు ఎలా ధ్రువీకరించాలో వివరించారు. విద్యార్థులకు వాస్తవికంగా ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏఐ ఇంటిగ్రేషన్, బాధ్యతాయుత ఏఐ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఐ నైపుణ్యం, నైతిక విలువలతో కూడిన వర్క్‌ఫోర్స్‌ను తయారుచేయడం ఎంపిక కాదని, అది అవసరం అనే సందేశంతో ఈ వర్క్‌షాప్ కొనసాగింది.

ఇద్దరి అదృశ్యం



రాజేశ్వరి

చిలకలగూడ : మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి నామాలగుండుకు చెందిన శ్రీనివాస్, రాజేశ్వరీ భార్యాభర్తలు. రాజేశ్వరి తండ్రి మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె డిప్రెషన్‌లోకి వెళ్లింది. వైద్యుడి సలహా మేరకు మందులు వాడుతున్నారు. కొద్ది రోజుల క్రితం శ్రీనివాసనగర్‌లోని పుట్టింటికీ వెళ్లిన రాజేశ్వరి (47) అక్కడి వారితో గొడవ పడింది. ఈనెల 19న ఉదయం 6 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో భర్త శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీనారాయణ

సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో రోగి ..

గాంధీఆస్పత్రి : రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడీగూడ ముగ్గుబస్తీకి చెందిన లక్ష్మీనారాయణ (46) భార్య మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. కొంతకాలంగా అస్వస్థతకు గురైన లక్ష్మీనారాయణ ఈనెల 16న గాంధీ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. 17న మధ్యాహ్నం 1 గంటకు బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ తిరిగి వార్డుకు రాలేదు. దీంతో పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి ప్రమీల బుధవారం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. లక్ష్మీనారాయణ కల్లుకు బానిసయ్యాడని పేర్కొనగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిలకలగూడలో ముగిసిన బోనాలు

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతర వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం అర్ధరాత్రి తర్వాత నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు, సాగనంపు యాత్రకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా వేదికలపై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, యువనాయకుడు రామేశ్వర్‌గౌడ్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఆదం విజయ్ కుమార్, జలంధర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, ఆకారం రమేశ్ తదితరులు సందడి చేశారు. జాతర ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన చిలకలగూడ పోలీసులు, జీహెచ్ఎంసీ, పలు విభాగాల అధికారులకు ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ఫెస్టివల్ కమిటీ అధ్యక్షుడు గుంటి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



స్వాగత వేదికపై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

యువకుడి మృతి



వీరబాబు (ఫైల్)

సికింద్రాబాద్: రైలు నుంచి పడి యువకుడు మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన పామర్తి వీరబాబు (23) ఆటోడ్రైవర్. తన మిత్రుడితో కలిసి శనివారం బోనాల వేడుకలు చూసేందుకు సికింద్రాబాద్‌కు వచ్చారు. బోనాలు చూసుకుని తాను మచిలీపట్నం వెళ్తున్నానని తన మిత్రుడితో చెప్పి ఆదివారం రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాడు. మంగళవారం ఉదయం మౌలాలి రైల్వేస్టేషన్ సమీపంలోని డౌన్‌లైన్ పక్కనగల కాల్వలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా గుడివాడకు చెందిన వీరబాబుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. రైలు నుంచి జారిపడి వీరబాబు మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

గంజాయి మత్తులో ఘర్షణ

లాలాపేట: శాంతినగర్ ఆర్యనగర్‌లో కొందరు యువకులు గంజాయి మత్తులో తరచూ ఘర్షణలు పడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇదే క్రమంలో గత రాత్రి కొందరు వ్యక్తులు ఆ ప్రాంతానికి వచ్చి గంజాయి సేవిస్తూ కనిపించిన వారితో గొడవకు దిగారు. దీంతో స్థానికులు అర్ధరాత్రి డయల్ 100 కు ఫిర్యాదు చేశారు. మంగళవారం మధ్యాహ్నం లాలాగూడ పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గంజాయి సేవిస్తున్నవారు, క్రయ విక్రయాదారుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. గంజాయి బెడద నివారించేందుకు ఈ ప్రాంతంలో ప్రతి 2 గంటలకు ఒకసారి పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. బస్తీ వాసులంతా కలిసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్సై, ఏఎస్సైలు ఉపేందర్, రాజు, సిబ్బంది, ఆర్యనగర్ వాసులు హరి, నరహరి, కుమార్ షాను, బస్తీ మహిళలు పాల్గొన్నారు.



ఆర్యనగర్ వాసులతో మాట్లాడుతున్న పోలీసులు

BEFORE THE HONOURABLE I JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : SECUNDERABAD
OS NO.975 OF 2022

Between :
Mrs Shaly Michael
2 Mr Michael Ignatious Rowel Both are resident of H.No. 9-2-659 Regimental Bazaar, Secunderabad Telangana 500 008.
...Plaintiffs
And
Fox International represented by Ms Manasi Situated at 502, Corporate Arena D.P.Piramal Road Off Aarey Road Goregaon West Mumbai 400 104
2 Ms Manasi Suraj Yeshwantrao, R/o 4/1 Arunoday, Sant Dnyaneshwar Marg,NR Ganesh Mandir Odhav Nagar Borivali East S.O.Borivali East, Mumbai Maharashtra 66
...Defendants

Whereas the Plaintiffs herein above have instituted a suit against you for recovery of money. You are hereby summoned to appear before the Hon'ble I Junior Civil Judge City Civil Court Secunderabad at 10.30 am on 20th August 2025 either in person or by a pleader duly instructed able to answer all material questions relating to the suit or shall be accompanied by some person able to answer all such questions. Take notice in default of your appearance and to file your written statement within the stipulated period of 30 days the suit will be heard and determined in your absence.

// BY ORDER OF THE HONOURABLE COURT//
Sd/- ANNIE MATHEWS, Advocate (TS1298-A/95)
25 Surya Enclave Trimulghery, Secunderabad, Mobile: 9848092435

IN THE COURT OF THE XI JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD
O.S.NO. 529 OF 2025

Between :
Smt. Jemunolla Lakshmi & 2 others
...Plaintiffs
And
1. The Tahasildar, Secunderabad Mandal, Secunderabad.
2. All Concerned ...Defendants

The above case is filed by the Plaintiffs against you for declaring them as legal heirs of Late Sri. Jemunolla Veera Swamy, and the same is posted to 28.07.2025 before the above said court at 10.30 am, please take notice that anybody having any objection for granting the above said relief, they may come and oppose the same before the above said court on the above said date in person or through their advocate. If no objections are received the matter will be decided ex-party.

// By the Order of Court //
Sd/- P. VIKRAM KUMAR, Advocate
Plot No. 24, Ravi Co-operative Housing Society, Tirmulgherry, Secunderabad-500 015